క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న సర్పంచ్ ఇందుమతి

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని మహిళా సంఘాల సభ్యులకు ఇఫ్కో సమగ్ర రైతు సహకార సంస్థ ఆధ్వర్యంలో సబ్సిడీపై నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. మైక్రో ప్లానింగ్‌లో భాగంగా ఇఫ్కో సంస్థ రాయితీపై అందజేస్తున్న ఈ నిత్యావసర సరుకులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కె.ఇందుమతి కోరారు. సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని దాదాపు 56 వేల మహిళా సంఘాలకు స్వయం ఉపాధిని కల్పించడం జరిగిందని విజయనగరం జిల్లా ఇఫ్కో ప్రాజెక్టు మేనేజర్ అల్లు పోలినాయుడు తెలిపారు. కార్యక్రమంలో టి.శంకరరావు, ఎస్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



అవగాహన కల్పిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: మాదకద్రవ్యాలకు బానిస కావద్దు.. జీవితాలు కోల్పోవద్దని ఎస్సై వై.అమ్మన్నరావు పిలుపునిచ్చారు. స్థానిక డిగ్రీ కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో 'సంకల్పం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, ఎన్‌డీపీఎస్ (నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే చేయాలి



రక్త పరీక్షను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

గరుగుబిల్లి: గ్రామాల్లో చేపడుతున్న ఇంటింటా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని పెదగుడబ పంచాయతీలోని ఎస్.ఆర్.పేటలో శుక్రవారం నిర్వహించిన ఇంటింటా సర్వేను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీసీపీ 3.0 సర్వేను ప్రారంభించడం జరిగిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు తీవ్రమయ్యే వరకు గుర్తించలేని పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు గాను ఈ ఎన్‌సీడీసీపీ సర్వేను చేపట్టడం జరుగుతోందన్నారు. మధుమేహం, బీపీ, కేన్సర్, మూర్ఛ, టీబీ తదితర వ్యాధులను గుర్తించడం జరుగుతోందన్నారు. న్యూమోనియా వ్యాధి లక్షణాలపై కూడా సర్వే చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎపిడమిక్ ఈవో సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు నామినేషన్ల స్వీకరణ



దాసరి కృష్ణ, జీసీసీ మేనేజర్, సీతంపేట

సీతంపేట: గిరిజన సొసైటీ ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్లు స్వీకరించనున్నట్టు జీసీసీ బ్రాంచ్ మేనేజర్ దాసరి కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రత్యేక ఎలక్షన్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఎన్నిక జరుగుతుందన్నారు. సొసైటీ పరిధిలో 649 మంది సభ్యులున్నారన్నారు. ఈనెల 18న నామినేషన్ల పరిశీలన, 19న ఉపసంహరణ, అదేరోజు సాయంత్రం ఏకగ్రీవాలు ఏమైనా జరిగితే ప్రకటించనున్నారు. ఏకగ్రీవం కాకపోతే చేతులెత్తే పద్ధతిలో ఈనెల 25 ఎన్నిక ఉంటుందన్నారు. సొసైటీలో చైర్మన్, వైస్ చైర్మన్, నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉంటారు.

గిరిజన హక్కులు కాపాడాలి

పార్వతీపురం టౌన్: జీఓ నంబర్ 3 పునరుద్ధరణ, 1/70 పీసా చట్టం పక్కాగా అమలు చేయడంతో పాటు గిరిజన చట్టాలు, హక్కులు కాపాడాలని గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జాతీయ గౌరవ దివస్‌లో రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు నష్టం చేసే నిర్ణయాలు, ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు. జిల్లా ఏర్పాటు తర్వాత పార్వతీపురం ఐటీడీఏ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసారు.

ఒక్క క్లిక్‌తో ఉపాధి సమాచారం




ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులు(ఫైల్)

- ఉపాధిహామీ పథకానికి సాంకేతికత మేళవింపు
- జన్‌మన్ రేగ యాప్‌తో పూర్తి సమాచారం
- వేతనదారులకు అవగాహన కార్యక్రమాలు

పాలకొండ రూరల్: జీవనోపాధిలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ పనులకు వెళ్లే వారికి కోసం కేంద్ర ప్రభుత్వం సరికొత్త యాప్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉపాధిహామీ పనులు ఎక్కడ చేశారు? వేతనదారుల ఖాతాల్లో నగదు జమ అయ్యిందా? లేదా? తదితర వివరాలను తెలుసుకునేందుకు ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న వేతనదారుల కోసం కేంద్రం 'జన్‌మన్ రేగా' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్ ద్వారా సమగ్ర సమాచారం తక్షణమే తెలుసుకునే వీలుంది. వేతనదారుల వరకు ఏ సమాచారం కావాలన్నా ఇకపై ఎంపీడీఓ, తపాలా శాఖ కార్యాలయాలు, ఉపాధి సిబ్బంది చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ అరచేతిలో సమగ్ర సమాచారం తెలుసు కునే వీలుంది.

ఏయే వివరాలు ఉంటాయంటే..

'జన్‌మన్ రేగా' యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ డౌన్లోడ్ చేసుకోవాలి. ఇందులో వేతనదారు వివరాలు, హాజరు, వేతనాలు, తదితర వివరాలు ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చు. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధి జాబ్ కార్డు నంబరు నమోదు చేసి క్లిక్ చేస్తే చాలు పూర్తి వివరాలు కనిపిస్తాయి. వేతనదారు పేరుపై క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, వేతనం మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయింది. ఎంత మొత్తం జమ అయిందో తదితర వివరాలు కన్పిస్తాయి. ఒకవేళ వేతనదారుడికి నగదు జమ కాకుంటే ఏ కారణంతో జమ కాలేదో స్పష్టంగా కన్పిస్తాయి. వీటితో పాటు ఉపాధి ప్రణాళికలో చేపట్టే పనుల వివరాలు, సమాచారం ఉంటుంది.



అవగాహన కల్పిస్తున్నాం..



ఉపాధిహామీ పనులు చేపట్టే జాబ్ కార్డుదారులు వారి వేతనాలు, ఇతర విషయాలు తెలుసుకునేందుకు జన్‌మన్ రేగా యాప్ చక్కగా ఉపకరిస్తుంది. ఎవరైనా ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. తొలుతగా ఫీల్డ్ అసిస్టెంట్లకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌మన్ రేగా యాప్ పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. యాప్ ద్వారా ప్రతి విషయాన్ని తెలుసుకునే వీలుంది. వేతనంతో పాటు, పనుల వివరాలను తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది.

– ఎం.ఈశ్వరమ్మ, ఉపాధి ఏపీఓ, పాలకొండ

ఫిర్యాదు చేయవచ్చు..

ఉపాధి పనుల్లో అక్రమాలు, అవినీతిపై జన్‌మన్ రేగా యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పని చేసినా, ఉపాధి సిబ్బంది బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా ఫిర్యాదు చేయవచ్చు. ఈ వివరాలు అన్ని భాషల్లోనూ అందుబాటులో ఉంటాయి. ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈయాప్‌ను రూపొందించింది.

నియోజకవర్గంలో...

పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 50,888 మంది జాబ్‌కార్డుదారులుండగా 145 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధిహామీ పనులను పర్యవేక్షణ చేస్తున్నారు. తొలుతగా ఫీల్డ్ అసి స్టెంట్లు, మేట్లు ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని, జాబ్‌కార్డుదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

నగరపంచాయతీ చైర్‌పర్సన్ రాజీనామా



రాజీనామా పత్రాన్ని కమిషనర్‌కు అందిస్తున్న రాధాకుమారి

పాలకొండ: నగరపంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి వ్యక్తిగత కారణాలతో వార్డు సభ్యత్వంనకు, చైర్‌పర్సన్ పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లతో కలిసి కమిషనర్ సామంచి సర్వేశ్వరరావుకు రాజీనామా పత్రన్ని అందించారు. రాధాకుమారి భర్త నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు ఆమెకు కారుణ్య నియామకంలో ప్రభుత్వ ఉద్యోగం లభించింది. దీంతో నిబంధనల మేరకు ఆమె 19వ వార్డు సభ్యత్వంనకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ మహిళగా ఉన్న తనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గుర్తింపు కల్పించారన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో పాటు పాలకొండ అభివృద్ధికి సహకరించిన కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆమెతో పాటు వైసీపీ కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కడగల రమణ, పల్లా ప్రతాప్, దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణ్ కుమార్, తూముల లక్ష్మణరావు ఉన్నారు.

నిరుద్యోగులతో చెలగాటం వద్దు

- మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: డీఎస్సీ నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం నిరుద్యోగులతో చెలగాటం ఆడుతోందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండువ గ్రామంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు డీఎస్సీ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ ఏడాది డిసెంబర్ లోగా డీఎస్సీ పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు చేసిన తొలి సంతకం ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. డీఎస్సీని వాయిదాలు వేస్తూ కాలయాపన చేయకుండా దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

హోరాహోరీగా క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

సీతంపేట: జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ స్థాయి క్రీడా పోటీలను స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఏటీడబ్ల్యూవో పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 23 పాఠశాలల నుంచి సుమారు 230 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్చరీ, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలతో పాటు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చంద్రరావు, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్‌దయానంద్, పీడీలు వెంకటరావు, భాస్కర్, జగదీష్, రవి, జనార్దన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బిర్సాముండా జయంతి



జియ్యమ్మవలస: బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గిరిజన సంఘ నాయకులు

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ గ్రామంలో ఆదివాసీ యోధుడు బిర్సాముండా జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిరిజన సంఘ నాయకుడు ఆరిక చంద్రశేఖర్ తదితరులు కలిసి బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు కొనియాడారు. గిరిజనుల హక్కుల సాధనకు ఆయన అలుపెరుగని పోరాటం సాగించారన్నారు. చిన్నతనం నుంచే బ్రిటీషర్ల దౌర్జన్యాన్ని ఎదురించిన ధీరుడు అన్నారు. ఆ తర్వాత రామభద్రపురం పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కార్యక్రమంలో యస్. మాణిక్యేశ్వరరావు, వి.సింహాచలం, బాలకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక సారధి ఒకేషనల్ జూనియర్ కళాశాల వద్ద ట్రైబల్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో బిర్సాముండా జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎల్విన్‌పేట సీఐ బి.హరి, టీఆర్ఎఫ్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రొబ్బా లోవరాజు, ఇంటికుప్పల రామకృష్ణ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై, బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం బిర్సాముండా పోరాడిన తీరును సీఐ కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: ఐటీడీఏలో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

భామిని: మండలంలో బిర్సాముండా జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బత్తిలిలో సర్పంచ్ టింగ శాంతికుమారి ఆధ్వర్యంలో బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెద్దదిమిలిలో సర్పంచ్ తొగరాన శ్రీను, కార్యదర్శి ఉషారాణి ఆధ్వర్యంలో గ్రామస్తులు బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



గుమ్మలక్ష్మీపురం: బిర్సాముండా సేవలను కొనియాడుతున్న సీఐ హరి



సీతంపేట: బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు



భామిని: బత్తిలిలో బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ శాంతికుమారి

అందమైన జీవితాన్ని ఆస్వాదిద్దాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కళాధర్

వీరఘట్టం: కన్ను తెరిస్తే జననం..కన్ను మూస్తే మరణం..రెప్పపాటు ఈ జీవితం మధ్యలోనే ముగిసిపోకూడదు. అందమైన ఈ జీవితాన్ని ఆనందంగా ఆస్వాదిద్దామని ఎస్సై జీ కళాధర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తూ అవగాహన కల్పించారు. క్షణికావేశం, అపార్థాలు నిండు జీవితాలను బలితీసుకుంటున్నాయన్నారు. అవయవ లోపంతో కటిక దరిద్రంతో కష్టాలు పడేవాళ్లు సైతం నిత్యం బతుకు పోరాటం చేస్తున్నారని, అటువంటి వారిని చూసైనా మనం మనోధైర్యం పెంచుకోవాలని సూచించారు. నిజానికి ఏ సమస్య లేనివారు ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఉండరని అన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, విద్యార్థి దశ నుంచే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

సీతానగరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీతానగరం సర్కిల్ పరిధిలోని గాదెలవలసలో అధికారులు శుక్రవారం దాడులు చేపట్టగా పది మద్యం సీసాలతో ఒకరు పట్టుబడినట్లు సీఐ డి. పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే సర్కిలపరిధిలోని బలిజిపేట, గరుగుబిల్లి, సీతానగరం మండలాల్లో సిబ్బందితో ముమ్మరంగా దాడులు చేపడుతున్నామన్నారు.

పదోన్నతులు కల్పించాలి

పార్వతీపురం టౌన్: ఉమ్మడి విజయనగరం జిల్లాలో వెంటనే మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు కల్పించాలని యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. మురళీ మోహనరావు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. రమేష్, కె. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల మొదటి వారంలో చేపట్టాల్సిన పదోన్నతులు విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఉందని నిలిపివేశారని పేర్కొన్నారు. అయితే కోర్టు తీర్పు నేపథ్యంలో ఎన్నికల కోడ్ రద్దు అయినందున వెంటనే షెడ్యూల్ ప్రకటించి పదోన్నతులు చేపట్టాలని కోరారు. మొదట షెడ్యూల్ ఇచ్చినప్పుడు అన్ని సబ్జెక్టులకు సీనియారిటీ జాబితాలు ఇవ్వలేదని, వెంటనే అన్ని సబ్జెక్టులకు సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలని కోరారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి..



మాట్లాడుతున్న సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

పాలకొండ రూరల్: పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు గృహ నిర్మాణాల కోసం కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ అమలు చేయాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు 1900 మంది నివాసాలు ఏర్పర్చుకునేందుకు మంజూరు చేసిన స్థలాన్ని, అక్కడ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులను శుక్రవారం సంఘ సభ్యులు కలిసి మాట్లాడారు. వారి సమస్యలు అగిడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి నాయకుల ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్య పరిరక్షణతో పాటు ఇతర మౌలిక వసతులు సంపూర్ణంగా కల్పించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 18న స్థానిక నగరపంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు పాలకొండ నియోజకవర్గ కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. వారి వెంట గురుబిల్లి సూరపునాయుడు, త్రినాథరావు, జనార్దనరావు తదితరులున్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి



రైతులకు విత్తన కిట్లు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

పాలకొండ రూరల్: రబీ పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్ అన్నారు. మండలంలోని నవగాం రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడి రైతులతో మమేకమయ్యారు. ఖరీఫ్‌లో వారు పండించిన వరి వంగడ రకాలు, దిగుబడిపై ఆరా తీశారు. వతావరణ పరిస్థితులు, భూ సారంను పరిగణలోకి తీసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టిపెట్టాలని, ఆవిధంగా రైతులను చైతన్యపరచాలని ఏఓ ఎన్ని వాహినికి సూచించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రబీలో సాగుచేసేందుకు పెసర, మినుము విత్తన కిట్లు అందించారు.

బాధ్యతల స్వీకరణ

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా కేతిరెడ్డి త్రినాధమ్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె పార్వతీపురం ఐటీడీఏలో హ్యూమన్ డెవలప్‌మెంట్ ఏపీఎంగా పనిచేసి, ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండలంలోని మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆమె అన్నారు.

ప్రమాదకరంగా ట్యాంకు

వీరఘట్టం: మండలంలోని దశమంతపురం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం ద్వారం పక్కన మరుగుదొడ్డి కోసం నిర్మించిన ట్యాంకు ప్రమాదకరంగా మారింది. సుమారు రెండు నెలల క్రితం ఈ ట్యాంకు నిర్మాణం చేపట్టి మధ్యలోనే పనులు ఆపేశారు. ప్రతీ రోజు కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణిలు, బాలింతలు ఈ ట్యాంకు పక్క నుంచే అంగన్‌వాడీ కేంద్రంలోకి రావాల్సి ఉంది. ఈ కేంద్రం వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి ట్యాంకు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న ట్యాంకు

ఎంపీడీవో పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని బీజే పురంలో ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్(బాలురు)లో ఎంపీడీవో ఎస్.రమేష్ గురువారం రాత్రి బస చేశారు. అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను స్వయంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శుక్రవారం ఉదయం అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య నందించాలని, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేయాలని తెలిపారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న ఎంఈవో సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని బియ్యాలవలస గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యస్ సొసైటీ వారు వితరణ చేసిన విద్యాసామగ్రిని శుక్రవారం అందజేశారు. మొత్తం 45 మంది విద్యార్థులకు ఎంఈవో సత్యనారాయణ చేతులమీదుగా నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని, విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై సిబ్బంది శ్రద్ధ వహించాలని ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడు, వీఆర్వో అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఏర్పాటు అభినందనీయం



గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని దురుబిలి గ్రామంలో గ్రామస్తులంతా కలిసి ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయాన్ని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు శుక్రవారం సందర్శించారు. ప్రపంచ విజ్ఞానం గ్రామంలో కొలువుదీరేలా యస్ సొసైటీ ప్రోత్సాహంతో గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఆయన అన్నారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిఒక్కరూ రోజులో ఏదో ఒకపూట గ్రంథాలయానికి వచ్చి, పేపర్లు, పుస్తకాలు వంటివి చదవాలన్నారు. పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం సంపాదించుకోవచ్చన్నారు. ఆయన వెంట సర్పంచ్ పువ్వల అజ్జరి ఉన్నారు.

'మత్తు'తో జీవితం చిత్తు



అవగాహన కల్పిస్తున్న కురుపాం పోలీసులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మత్తు పదార్థాలతో జీవితం చిత్తు(నాశనం) అవుతుందని, ప్రతిఒక్కరూ మద్యం, గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. కురుపాం మండలంలోని దురిబిలి గ్రామంలో సంకల్పం పేరిట మత్తు పదార్థాలు–వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రస్తుత రోజుల్లో ఫ్యాషన్ మాయలో పడి విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి అలవాట్లు అలవర్చుకుని, సమాజంలో ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వారుగా జీవించాలని ఆకాంక్షించారు. అలాగే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. మహిళలను గౌరవించాలన్నారు.